بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد



# బదర్ యుద్ధ పరిస్థితులు, సంఘటనల విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 14.07.2023 తేదీన - మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము**

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ - أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ ○ بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ أَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించిరి.

బదర్ యుద్ధము గురించి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర, సంఘటనలు ప్రస్తావించబడుతున్నవి. బదర్ యుద్ధము ముగిసినది. అవిశ్వాసులను అల్లాహ్ తఆలా అంతమొందించెను. 70 మంది అవిశ్వాసులు హతమైనారు. వీరిలో అనేక మంది నాయకులు, ధనికులు ఉండిరి.

ఖురైష్ నాయకుల ఖననం గురించి ఇట్లు ప్రస్తావన గలదు. సహీ బుఖారిలో ఇట్లు కథనము గలదు. ఒకసారి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఖానాకాబాలో నమాజ్ చదువుతుండిరి. సజ్దాలో ఉన్నప్పుడు ఒక పశువు గర్భసంచిని వారి సల్లం వీపు పైన కొందరు పెట్టిరి. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సజ్దాలోనే ఉండిపోయిరి. అవిశ్వాసులు నవ్వుతుండిరి. ఇంతలోనే అక్కడికి హజ్రత్ ఫాతిమా రజియల్లాహు తఆలా అన్హా వచ్చి, ఆ భారీ వస్తువును వారి సల్లల్లాహు అలైహి వసల్లం వీపు పై నుండి తొలగించిరి. ఈ సందర్భమున హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రార్థన చేసిరి. ఓ అల్లాహ్! నువ్వు ఖురైష్‌లను శిక్షించుము. అనంతరం వారు సల్లల్లాహు అలైహి వసల్లం అమర్ బిన్ హశ్శామ్, ఉత్బ బిన్ రబీఅ, షైబ బిన్ రబీఅ, వలీద్ బిన్ రబీఅ, ఉమయ్య బిన్ ఖల్ఫ్‌తో మరి కొందరు అవిశ్వాసుల పేర్లను ఉచ్ఛరించి ఇట్లు ప్రార్థన చేసిరి. ఓ అల్లాహ్! వీరిని శిక్షించుము. కథకులు హజ్రత్ అబ్దుల్లాహ్ ఇట్లు ఉల్లేఖించారు. నేను బదర్ రోజున స్వయంగా వారందరిని నేలపై పడి వున్నట్లు చూశాను. అనంతరం వారిని ఈడ్చుకెళ్లి బదర్‌లోని ఒక బొందలో పడవేయబడెను. ఈ సందర్భమున హుజూర్ స.అ.స. ఇట్లనిరి. బొందలో పడేసినవారు శాపగ్రస్తులు.

హజ్రత్ అబూతల్హ అన్సారి (రజి) ఇట్లు ఉల్లేఖించారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బదర్ యుద్ధము రోజున అవిశ్వాసుల 24 మంది గురించి ఆదేశించినందున వారిని బదర్‌లోని బావిలో పడవేయబడెను. బదర్ నుండి తిరిగి వస్తున్నప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బావి వద్ద

నిలబడి ఆయా అవిశ్వాసులను, వారి తండ్రుల పేర్లను ఉచ్చరిస్తు ఇట్లనిరి. విచారము! మీరు అల్లాహ్, అతని ప్రవక్తకు విధేయత వహించినచో బాగుండెడిది. అల్లాహ్ తన ప్రవక్తతో చేసిన వాగ్దానమును మేము పొందినాము.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజియల్లాహు తఆలా అన్హు ఈ సంఘటనను తెలియజేస్తూ ఇట్లనిరి. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం పదములు అనగా ఓ బొందలో పడ్డవారు! మీరు నాతో యుద్ధము చేశారు. ఇతరులు నాకు సహకరించారు. ఈ యుద్ధములు అవిశ్వాసుల ద్వారా మొదలు పెట్టబడినవని, వారు సల్లల్లాహు అలైహి వసల్లం విధిలేని పరిస్థితిలో ఆత్మ రక్షణ కొరకు ఖడ్గము పట్టుకున్నారని వారి స.అ.స.కు పూర్తి నమ్మకముండెనని తెలుస్తుంది.

చరిత్ర పుస్తకములలో బదర్ యుద్ధ ప్రస్తావనలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా సంభవించిన పలు మహిమలు తెలుపబడినవి. అకాష బిన్ ముహ్సిన్ (రజి) గురించి ఇట్లు ప్రస్తావన గలదు. బదర్ యుద్ధము రోజున వారు తమ ఖడ్గముతో యుద్ధము చేస్తుండిరి. చివరికి అది వారి చేతిలో విరిగి పోయినది. కావున వారు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకొనిరి. అప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారికి ఒక కర్ర ప్రసాదించి, ఇట్లనిరి. నువ్వు దీని ద్వారా అవిశ్వాసులతో యుద్ధము చేయుము. అకాశా ఆ కర్రను తమ చేతిలో తీసుకొని త్రిప్పడం మొదలు పెట్టగా అది ఖడ్గముగా మారినది.

మక్కాలో అవిశ్వాసుల ఓటమి వార్త ఎలా అందినది. దీని గురించి ఇట్లు వ్రాసి వుంది. అన్యారాధకులు ఆందోళన చెందుతు మక్కా వైపు పరుగెత్తిరి. సిగ్గు, లజ్జ వలన ఎలా మక్కాలో ప్రవేశించాలో వారికి అర్థం కాలేదు. అవిశ్వాసులు మక్కా ప్రజల ఓటమి గురించి వార్త అందించినప్పుడు వారికి నమ్మకము కలుగలేదు. మృతుల గురించి రోధించడం, శోకము వ్యక్త పరచకూడదని ఖురైష్‌లు ప్రజలను నిలువరించిరి.

మరో వైపు విజయ శుభవార్త అందించుటకు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి)ను మదీనా పై భాగానికి, హజ్రత్ జైద్ బిన్ హారిస (రజి)ను మదీనా లోతట్టు ప్రాంతానికి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పంపి వుండిరి.

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. మేము మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కుమార్తె, హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) సతీమణి హజ్రత్ రుఖయ్య సమాధిని మట్టితో సమానం చేసినప్పుడు మాకు విజయ శుభవార్త అందినది.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒంటెపై సవారీ హజ్రత్ జైద్ బిన్ హారిస (రజి) మదీనాలో ప్రవేశించినప్పుడు ముస్లిములకు యుద్ధములో ఓటమి ఎదురైనది, నవూజుబిల్లాహ్ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యుద్ధములో హతమైనారు, అందుకే జైద్ వారి స.అ.స. ఒంటెపై

సవారీ చేస్తూ వస్తున్నారని దాంబికులు, యూదులు చెప్పడం మొదలు పెట్టిరి. హజ్రత్ జైద్ బిన్ హారిస (రజి) విజయ శుభవార్త అందించి, ఖురైష్ నాయకుల పేర్లు సైతం తెలుపుతు ఫలానా ఫలానా ఖురైష్ నాయకులు హతమైనారని చెప్పినప్పుడు ఇదెలా సాధ్యమగునని దాంబికులు అంటుండిరి. యుద్ధములో ఓడిపోయినందున, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హతమైనందున హజ్రత్ జైద్ బిన్ హారిస (రజి) మతి పోయిందని వారనిరి.

విజయానందములో మదీనా వాసులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను స్వాగతించుటకు మదీనా బయటికి వచ్చిరి. ఆయా ముస్లిముల ఆనందము చూడముచ్చటగా వుండెను.

ఈ యుద్ధములో ముస్లిములకు శత్రువుల సామాగ్రిలో భాగంగా 150 ఒంటెలు, పది అశ్వములు లభించినవి. ఇంతే గాక అన్ని రకాల వస్తువులు, ఆయుధములు, వస్త్రములు, అనేక చర్మములు, రంగు వేయబడిన చర్మములు, ఉన్ని మొదలగు ధనము లభించినది. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ అనుచరులకు సమానంగా మాత్రమే తమ భాగము తీసుకొనిరి. అనుచరులు ఒక ఖడ్గమును దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు కేటాయించిరి. అబూజహల్‌కు చెందిన ఒక ఒంటె కూడ మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు లభించెను. చరిత్ర పుస్తకములలో ఈ ఖడ్గము, ఒంటెకు చాలా ప్రాముఖ్యత ఇవ్వబడినది. ఈ ఖడ్గము పేరు జుల్ఫికార్ వుండెను. తర్వాత ఇతర యుద్ధములలో కూడ ఈ ఖడ్గమును పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ వద్ద పెట్టుకొనిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనంతరం ఈ ఖడ్గము అబ్బాసీ ఖలీఫాల వద్ద వుండెను. ఇదే విధంగా ఆ ఒంటె కూడ హుదైబియా శాంతి ఒప్పందము వరకు వారి వద్దనే వుండెను. హుదైబియా శాంతి ఒప్పందము సందర్భమున వారు స.అ.స. ఆ ఒంటెను బలిదానము కొరకు తమ వెంట తీసుకెళ్లిరి.

వారు సల్లల్లాహు అలైహి వసల్లం అమరుల వారసులకు శత్రు సామాగ్రిలో భాగము అందించిరి. ఇదే విధంగా మదీనాలో వున్నటువంటి ఉపాధ్యక్షులకు, వివిధ బాధ్యతలను నెరవేరుస్తున్నందున యుద్ధములో పాల్గొనలేక పోయిన బాధ్యులకు సైతం భాగము పంచి పెట్టిరి.

బదర్ ఖైదీలతో నష్టపరిహారము తీసుకొని వారిని విడుదల చేసిరి. ఈ నష్టపరిహారము ఒక వెయ్యి నుండి నాలుగు వేల దిర్హమ్‌లు ఉండెను. నష్టపరిహారము చెల్లించలేని వారు మదీనాలోని ఇద్దరు పిల్లలకు చదవడం వ్రాయడం నేర్పినచో విడుదల చేయబడుతారని షరతు విధించబడెను. ఇంకా కొందరు ఖైదీలను తక్కువ నష్టపరిహారము తీసుకొని లేదా ఎలాంటి నష్టపరిహారము తీసుకోకుండానే విడిచి పెట్టిరి. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) దీని గురించి ఇట్లు వ్రాశారు.

మదీనాకు చేరుకున్న తర్వాత మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఖైదీల గురించి వీరిని ఏమి చేయాలని సలహా సేకరించిరి. అరబ్‌లో ఖైదీలను సర్వసాధారణంగా హత్య చేయడం లేదా శాశ్వతంగా బానిసలుగా పెట్టుకొనే ఆచారము కొనసాగుతుండెను. కాని మహా ప్రవక్త సల్లల్లాహు

అలైహి వసల్లం స్వభావము దీనిని ఏమాత్రం ఇష్ట పడలేదు. ఇప్పటి వరకు దీని గురించి ఎలాంటి దైవాదేశములు సైతం అవతరించలేదు. నా దృష్టిలో వీరితో నష్టపరిహారము తీసుకొని విడిచి పెట్టవలెను, తుదకు వీరు మన బంధువులే, రేపు వీరిలోనే కొందరు ఇస్లాం వీరాభిమానులుగా సిద్ధమగుటలో ఆశ్చర్యమేమి లేదని హజ్రల్ అబూబకర్ (రజి) తమ అభిప్రాయమును తెలిపిరి. కాని హజ్రత్ ఉమర్ (రజి) ఈ అభిప్రాయముతో విభేదించి ఇట్లనిరి. ధర్మము విషయములో బంధుత్వమును లెక్క చేయకూడదు. వీరు తమ కర్మల వలన హత్యకు అర్హులైనారు. కావున నా దృష్టిలో వీరందరిని హత్య చేయవలెను. ఇంతే కాక ముస్లిములు తమ తమ బంధువులను తాము స్వయంగా హతమార్చాలని ఆదేశించవలెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ సహజ కరుణా స్వభావము వలన హజ్రత్ అబూబకర్ (రజి) సలహాను ఇష్టపడిరి. హత్యకు భిన్నంగా తీర్పు వెల్లడించిరి. నష్టపరిహారము చెల్లించిన అన్యారాధకులను విడిచి పెట్టాలని ఆదేశించిరి. తర్వాత దీనికి అనుగుణంగా దైవాదేశము అవతరించెను. కనుక ప్రతి ఒక్కరికి అతని స్థోమతను బట్టి ఒక్క వెయ్యి దిర్హమ్‌ల నుండి నాలుగు వేల దిర్హమ్‌ల వరకు నష్టపరిహారము నిర్ణయించబడెను. ఇలా ఖైదీలు విడుదల కావడం మొదలైరి.

అనంతరం హుజూరె అన్వర్ ఈ క్రింది ఇద్దరు మృతుల మరణ వార్త తెలిపి, వారి సద్గుణములను ప్రస్తావించి వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించి వారి క్షమాపణ, ఉన్నత స్థాయి కొరకు దుఆ కూడ చేసిరి.

(1) రానా అబ్దుల్ హమీద్ ఖాన్ గారు కాఠ్‌గఢీ మురబ్బి సల్సిల, నాయిబ్ నాజిమ్ మాల్ వక్ఫె జదీద్ పాకిస్తాన్.

(2) గౌ॥ నుస్రత్ జహాc అహ్మద్ గారు భర్త గౌ॥ ముబష్షిర్ అహ్మద్ గారు మురబ్బి సిల్సిల అమెరికా

---

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ - وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا - مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ - وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ - عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ - یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ - اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ -

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Telugu Desk)*